# రత్తమ్మ కష్టాలు

*మన సమాజంలో స్త్రీలకు; అందునా అమాయకులైన స్త్రీలకు ప్రతీ విషయంలో "నా" అనే దృష్టి ఎక్కువ. ప్రతి పనీ తాము చేస్తేనే గాని పూర్తిగాదనీ; తమకోసమే ప్రతీదీ ఎదురు చూస్తున్నదనీ అనుకుంటారు. చివరికి సమ కాలికులు కూడా తమని గురించే ఆలోచిస్తున్నట్లు భ్రమిస్తారు. అందువల్ల—*

రత్తమ్మ తల్లికి రారాని కష్టాలే వచ్చాయి. సీతమ్మవారి చెఱ లనుభవిస్తున్నదంటే నమ్మండి. ఆమాట కొస్తే ఆమె కున్నన్ని కష్టాలు ఆ సీతమ్మవారి కెక్కడున్నాయి? రాక్షసముండాకొడుకైనా ఆ రావణాసురుడు ఆమెను తీసుకెళ్ళి దేవతా వనంలాంటి అందమైన అశోకవనములో, దాసదాసీల మధ్య ఎంతో జాగ్రత్తగా వుంచాడు. కాకపోతే ఆమెకు వచ్చిన కష్టమల్లా కాని దేశంలో, నా అనేవాళ్ళు లేని చోటు. నిమిష మొక యుగంగా భర్త కొరకు ఎదురు చూస్తూ గడపటమేగా?

కాని రత్తమ్మ తల్లికి తను పుట్టిన వూళ్ళోనే, ఐన వాళ్ళ మధ్యనే, చెట్టంత భర్త రక్షణలోనే ఇన్ని కష్టాలు

వచ్చాయి. నిద్రమంచం దిగినప్పటినుంచీ, మళ్ళీ రాత్రి మంచ మెక్కేంతవరకూ అన్నీ అవాంతరాలే. అన్నీ కష్టాలే.

అప్పుడే భోంచేసి పంచలో గుంజ కానుకొని కూర్చుని ఆపసోపాలు పడసాగింది.

“రామ! రామ! ఈ మాయదారి మంద ఒక్క నిముషం శాంతంగా కూర్చోనివ్వదుగదా? ఎంత డబ్బుంటే నేమి? ఎంత హోదా వుంటే నేమి? సుఖపడే గీతుం డొద్దూ? అసలు ఈ డబ్బూ, హోదా పెరిగినకొద్దీ, అదే మోతాదులో కష్టాలు కూడా పెరుగుతున్నాయి. పూట కూటికీ గతిలేని పక్కింటి మల్లమ్మ తనకంటే ఎంతో సుఖ పడుతుంది. వున్న పూట యింత తిని లేనిపూట కడుపులో కాళ్ళు పెట్టుకుని శాంతంగా పడుకుంటారు. తనేమో సుఖపడి పోతున్నట్టు, రెండు కళ్ళతో చూడలేక, కళ్లలో నిప్పులు పోసుకుంటారు. ఐనవాళ్లూ, కానివాళ్లూ కూడ. వీళ్లకు తోడు అలగాజనం కూడా తన పాలిటే పడాలీ? పిల్ల సిరుసులు మంద! వీళ్ళతో ప్రాణం విసిగిపోతుంటేను.

“ఒక్కడూ సరిగా మాట వినడు. ఎవడూ సరిగా ఒక పని చేయడు. అదేమంటే ఎదురు మాట్లాడతారు. పెద్దవాళ్ల దగ్గర మాట్లాడుతున్నామనే విచక్షణా జ్ఞానం బొత్తిగా లేకుండా పోతుంది. ఆ మిషినీవాడు—వాడి

స్థితికి వాడు "వెధవ" తనకు ఎదురు మాట్లాడుతాడూ? గుడ్డ కాజేయటమే కాకుండా, పైగా కుదరకుండా కుట్టుకొస్తాడాయె! అదేమంటే దొంగ వెధవాయి "యీ గొప్పోళ్ళంతా ఎన్ని అన్యాయాలు చేయకుండా యీ కాడి కొచ్చారులే" అని కూస్తాడు. కూస్తాడు....కూస్తాడు ఎందుకు కూయడు. పక్కా లేకులు విరగతన్నే వాళ్లు లేక. ఇంతగా ముదిరిపోతుంది వీళ్ళ వ్యవహారం.

"చాకలాడికి గుడ్డలేస్తే సరిగా చేయడు సరి గదా చించుకొస్తా డాయె. అదేమంటే తనకిచ్చే జీతానికి ఆ పని చాలట. చాకలాడి నుండి పాకీవాడి వరకూ, మాట్లాడితే జీతం పెంచమంటారు. తమ దగ్గర వుచ్చితార్థంగా వచ్చిన డబ్బు రాసులు పోసుకు కూర్చున్నట్లు. ఎంత కష్ట పడితే తమ కా మాత్రం హోదా డబ్బూ వచ్చింది. వీళ్ళ గుడ్లు మాడ; వీళ్ళ చూపులు తన భర్త కష్టార్జితం మీదనే పడాలి? తన భర్త జీవితాన్నంతా ప్రజలకే అంకితం జేశాడు. ఎన్నిసార్లు జైలుకు వెళ్ళాడు? ఎన్ని బాధలు పడ్డాడు? ఎన్ని రోజులు తన కుటుంబం వస్తులు పడుకోలా? ఆఖరునకు ఆ గాంధీమహాత్ముని చలవవల్ల స్వరాజ్యం వచ్చింది. తమ కష్టాలు ఇరగడయాయి అనుకున్నది. కాని నానాటికీ కష్టాలు పెరిగిపోతున్నాయి.

"తన భర్త జిల్లాబోర్డు ప్రసిడెంటు కాగానే సరి పోయిందీ? ఎన్ని బాధ్యతలు? ఎంతమందికి జవాబులు

చెప్పాలి? పట్టుమని పది రోజులు పెళ్ళాం బిడ్డలతో నిశ్చింతగా కాలం గడపాలంటే వీల్లేదాయె? జీవితమంతా ప్రజలకే అంకితం చేశాడు. దీన్ని ఎవరు గుర్తించారు? పైగా మేమేదో సుఖపడి పోతున్నట్లు అందరూ పడుస్తారు.

"పనిమనిషి నుండి వంటవాడివరకూ తనమీద కత్తికట్టే వాళ్లే. ఒకళ్ళూ చెప్పిన పని సరిగా చేయరు గదా? ఆ సుబ్బిముండ ఇక సరేసరి. సందు దొరకటం ఆలస్యం ఏదో ఒకటి బొడ్లో దోపుతుంది. ఎంతమందిని మార్పించినా అంతా ఇలాగే పడ్డారు. మరీ ఆ "లక్ష్మి" కళ్లు. అబ్బ! వళ్లు గరగ పొడుస్తుంది తల్చుకుంటేనే. ఆ గుడ్లు పడ్డయ్యా నల్లరాయి బద్దలు కావలసిందే. మొన్నను పసివాడు ఏదో తింటుంటే దాని గుడ్లు మాడ, అది చూడనే చూసింది. ఇంకేముంది? సాయంత్ర మయేటప్పటికి బిడ్డకు పుట్టెడు జ్వరం, చలి ముంచుకొచ్చింది.

"అసలు కాలమే మారిపోయుంది. తన చిన్నతనంలో యీ అలగాజనం, ఎంత వినయ విధేయతలు చూపేవారు? నలుగురు పెద్దమనుషులు నడిచే దారిన నడిచేవారా? పేరెత్తి పిలిచేవారా? "బాబుగోరూ, దొరసానమ్మగోరూ" అంటూ ఎంతో వినయ విధేయతలు చూపేవారు. వళ్ళొంచి పని చేసే వారు. ఇప్పుడేముంది? అప్పే? పేరు పెట్టి "రత్నమ్మగోరూ, సాంబయ్యగోరూ" అంటం సాగించారు. ఇంకా రెండు రోజులు పోతే "రత్నమ్మా, సాంబయ్యా అనే అంటారు.

అసలు వీళ్ళకు రెక్కలు తెచ్చిందే మనవాళ్లు. స్వరాజ్యమనీ, కాంగ్రెసనీ వీళ్ళకు కాళ్లు తెచ్చారు. యీ మధ్య యీ కమ్యూనిష్టోళ్ళు వచ్చింతరువాత మరీ పెచ్చుమీరి పోతున్నారు. మనుషులంతా సమానమంట? వాళ్ళకూ మనలాగే బ్రతికే అధికారముందంట? ఎంత విడ్డూరం గాకపోతే గుఱ్ఱం గాడిదా ఒకటే! పితప కాలం పితప బుద్ధులు! వాళ్ళకూ అందరిలాగా బ్రతికే అధికారం వుంటే బ్రతకరాదూ? ఎవరొద్దన్నారూ? తిన్నతిండి వంట బట్టకుండా తమలాంటి వాళ్ళను అల్లరి పెట్టడం ఎందుకు? కలిపురుషుడు పుట్టి యీ కుక్కమూతి పిందెల్ని ఏరేస్తే గాని, మళ్ళీ ధర్మం నాలుగుకాళ్లా నడవదు.

"శ్రీ నారాయణమూర్తీ! ఎక్కడున్నావురా నాయనా! ఈ పాపం ఇంకెన్నాళ్ళకు పండుతుందిరా తండ్రీ!"

తన ఇంట్లో ఏమి చేసుకుంటున్నారో, ఏం తింటున్నారో, ఎలా ఉన్నారో, ఈ బజారుముండ అందరికీ ఎందుకు చెప్పండి? ప్రతివాళ్ళూ తన భర్తచుట్టూ పర్మిట్ల కోసం, లైసెన్సులకోసం, వుద్యోగాలకోసం తిరిగేవాళే. తన భర్త అసలే అమాయకుడు. తనూ అట్లాంటిదే అయితే యింకేమన్నా వుందీ? తనుమాత్రం వాళ్ళ పప్పులేమీ వుడకనివ్వదు. అప్పటికీ తన కన్ను కప్పి తన భర్త సహాయంతో పైకొచ్చినవాళ్లు ఎంతమంది లేరు?

పక్కింటి కాంతమ్మ చూడబోతే తాలూకాఫీసులో గుమస్తా పెళ్ళాం. ఇరగబాటు ఇంతంత కాదు. కాస్త పుట్టింటివాళ్లు తడిగలవాళ్ళని దాని అలపం భూమి పట్టకుండా ఉంది. దాని పిల్లల్ని తన బిడ్డలతో సమంగా వుంచాలని పోటీ పడుతుంది. తను తన కూతురుకు ఏచీర కొంటే అదే కొనటానికి ప్రయత్నిస్తుంది. పిల్లల మనస్సును నొప్పించకూడదట! నక్కెక్కడ నాగలోకమెక్కడ? ఎంత విరగబడితేమాత్రం దాని పిల్లలు తన బిడ్డల పోదాను అకదుకో గలుగుతారా? అసలు తన పిల్లలతో దాని పిల్లలకు పోటీ ఏమిటంటా? తన కూతురుకంటే దాని కూతురుకు కాస్త ఎర్రతోలయితే కావచ్చు దాని తెలివిమండ అన్నీ రాలుగాయ మాటలే?"

వూపిరాడని ఆలోచనలతో వుస్సురుస్సురు మంటుంది. ఇంతలో "ఏమే రత్తమ్మా! భోజనా లయ్యాయా?" అంటూ వారాకలిగా వేసిన ప్రహారీ తలుపును తోసుకొని కోటమ్మ లోపలకు వచ్చింది.

కోటమ్మ భర్త చిన్నతనంలోనే పోయాడు. ఆ వూళ్లో ఆమె ఎక్కని గడపా, ఆమెకు తెలియని విషయాలూ వుండవనే చెప్పాలి.

కోటమ్మను చూడగానే రత్తమ్మ ముఖం చాటంతయింది, "రా కోటమ్మక్కా. ఈ మధ్య బొత్తిగా నల్లపూసవై పోయావే?"

"మొన్ననేగా వచ్చి పోయాను. నిన్ననంతా కాంతమ్మ యింట్లోనే సరిపోయిందామె"

"ఏం విశేషం? వాళ్ల పుట్టింటి వాళ్ళెవరయినా వచ్చారా?" అన్నది రత్తమ్మ కోటమ్మకు దగ్గరగా జరుగుతూ.

"ఆఁ అదేం కాదులే. మనలో మనమాటకాని, నీకు తెలియదంటే నిన్న వాళ్ల సరళకు మనువుకోసం వచ్చారుగా?"

"అట్లాగంటే? ఏ వూరు? పిల్లవాడు బుద్ధిమంతుడేనా? ఆఁ. ఈ రోజుల్లో సంబంధాలు కట్నాలు గుమ్మరించందే ఎక్కడనుండి వస్తయ్యిలే? ఆడ పిల్లలకు పెండ్లి కావటమే గగనంగా వుంటే మనలో మనమాటగాని, అసలే ఆ కాంతి నోరు మంచిదికాదు. పొట్టకూటికి గతిలేనివారికి ఎక్కడనుండి బి. ఏ. లు, యమ్. ఏ. లు వస్తారులే" అంటూ తన మనస్సుకు తనే సమాధానం చెప్పకుంది రత్తమ్మ.

"కాదే రత్తమ్మా! ఇంకా నీకు తెలియలేదంటే? చాలా మంచి సంబంధం, కలలోకూడా వూహించలేని సంబంధమే అది" అన్నది కోటమ్మ రత్తమ్మ ముఖ కవళికలను పరికిస్తూ.

"అఁహాఁ! అంత మహాగొప్ప సంబంధ మేదో చెప్పరాదూ?" అన్నది వెటకారంగా,

"ఈమధ్య ఎవరో చాలా పెద్ద ఉద్యోగి, లక్షాధి కారి కొడుకు నీ కూతుర్ని చూడవచ్చారని చెప్పావే అదే సంబంధం."

"అఁ సుద్ద అబద్ధం. అంతా వట్టిది. ఆ కాంతమ్మ వుండే మహా కాలాంతకురాలు. ఎన్నయినా కల్పించ గలదు" అన్నది రత్తమ్మ ఎక్కడకో అగాధంలోకి కుంగి పోతూ.

"అబద్ధాలు చెప్పాల్సిన ఖర్మ నాకేం పట్టిందే?" అంటూ కోటమ్మ స్వరం పెంచింది.

కోటమ్మ స్వరంఅంటే ఆ వూళ్ళో అందరికీ హడలే. ఆమె నోటికి అడ్డేలేదు. ఆఖరుకు రత్తమ్మకూడా కోటమ్మ నోటికి భయపడుతుంది.

"అదికాదే కోటమ్మక్కా. నీ వెందుకు అబద్ధ మాడుతావ"ంటూనే వాళ్ళు నీకట్లా చెప్పారేమో అన్నాను కాని ఐనా కావచ్చులే. వాళ్ళ వంశం మంచిది కాదట. ఆ అబ్బాయికి అన్నీ దివ్వకాయ బుద్ధులేనట. అందుకే మావారు మా కమల నివ్వమని కబురంపేరు. ఎక్కడా కుదరకే ఇక్కడకు వచ్చుంటారు. అన్యాయంగా పిల్లగొంతు కోయవద్దని చెప్పవే కోటమ్మక్కా!" అన్నది; రత్తమ్మ పడిపోతున్న అగాధంలో ఏదో ఆసరా దొరికి నట్లు.

"అదేమిటే, నడమంత్రం? నిన్నటిదాకా వాళ్ళను తెగ పొగిడి ఇవ్వాళ యిలాగంటావు? వాళ్ళేమన్నారో

తెలుసా? మీ పిల్ల వాళ్లబ్బాయికి నచ్చలేదంట. ఆరోజే సరళను చూశాడట. తనకే ఆస్థి వున్నది కాబట్టి కట్నాలకు ఆశించక బంగారంలాంటి పిల్లకోసం వచ్చారంట" అంటూ కోటమ్మ ఆరిపోతున్న చిచ్చును ఎగతోసింది.

రత్తమ్మపని తలుపులు మూసికొట్టిన పిల్లిచందమైంది.

"ఆఁహా! మహా చెప్పొచ్చావు. అపుడూ? అంతా మమ్మల్ని రెండుకళ్ళతో చూడలేక పడ్చేవాళ్లే; మమ్మల్ని అన్యాయంగా ఆడిపోసుకున్న వాళ్లెవరు బాగుపడ్డారులే." అంటూ రత్తమ్మ కడుపు మంటతో తిట్లకు లంకించుకున్నది

"అయ్యో; నన్నెందుకు తిడతావే రత్తమ్మతల్లీ; ఎవ రేగంగలో కలిస్తే నాకేం? నా వందమంది పిల్లలకు యోగదని నాకు దిగులా" అంటూ కోటమ్మ తను వచ్చిన పని సవ్యంగానే జరిగిపోయినందుకు విజయ గర్వంతో లేచింది.

కోటమ్మ రత్తమ్మ గుమ్మం దాటేక తిట్లకు లంకించుకొని ఆ వీధి మలుపు తిరిగేవరకూ తిడ్తూనే పోయింది.

రత్తమ్మకు దూరంగా కోటమ్మగొంతు విన్పిస్తూనే వుంది. రత్తమ్మకు తేళ్లుకు ట్టినట్లయింది. వీధిలోకిపోయి కోటమ్మతో పోట్లాటానికి, తన గౌరవానికీ, తన గొప్ప

తనానికీ భంగం. గడపలోనే కూర్చుని, కప్పులేచిపోయేట్టు, గొంతెండేదాకా, సరళనూ, కాంతమ్మనూ, కోటమ్మనూ, లోకాన్ని దుమ్మెత్తి పోసింది రత్తమ్మ.

రత్తమ్మ కడుపుమంట తగ్గాక పళ్ళు నీరసించిపోయింది. వంటింట్లోకిపోయి బిందెడు మంచినీళ్లు గటగటా తాగి, మంచం వాల్చుకొని, మేను వాల్చింది.

"అమ్మగారూ?" వీధి వాకిట్లోనుండి కేక వినిపించింది.

"ఎవరూ?" అంటూ రత్తమ్మ లేచి కూర్చుంది.

"నేనండీ. మిషినీ సాయిబు కొడుకుని. మాఅయ్య డబ్బు లిప్పించుకు రమ్మన్నాడు." పదేళ్ళ కుర్రాడు వసారాలోకొచ్చి రత్తమ్మగారిముందు నిల్చున్నాడు.

"ఏం డబ్బులూ?" రాగం తీసింది రత్తమ్మ.

"కుట్టుకూలి" అన్నాడు కుర్రాడు.

"అప్పుడే యిచ్చాంగా? రత్తమ్మ హుంకరించింది.

"ఇంకా రెండు రూపాయలియ్యాలటండీ?"

"ఎవర్రా చెప్పింది? పిల్లవి రెండు చొక్కాలు, నా రవికా మీ దేవసాన కొట్టుకొన్నారుగా? ఎంత మంచి కంచి పట్టు రవిక గుడ్డ? పనికిరాకుండా కుట్టాడు.

"అదంతా నాకు తెల్దండీ, మా అయ్య డబ్బు లిప్పించుకు రమ్మన్నాడు.

"ఛీ! వెధవకుంకా?" ఛా అవతలికి? రత్తమ్మ గుడ్లెర్రజేసి గర్జించింది.

దాంతో మిషినీ సాయిబు కొడుకు ఆ లంకించు కున్న పరుగు పరుగు, వీధి మలుపు తిరిగి కాని నిల్చొని కొంచెం వూపిరి పీల్చుకోలేదు.

రత్తమ్మ మళ్ళీ మంచంలో కూలింది. ఒక కునుకు తీద్దామని కన్ను మూసేసరికి ప్రహారీగోడమీద కాకి ఒకటి వాలి "కాకా" అని అరవటం మొదలెట్టింది.

చెప్పొద్దూ? ఏదో మధ్యాహ్నంపూట ఒక కునుకు తీద్దామని పడుకున్న రత్తమ్మకు చిర్రెత్తిపోయింది.

"ఇషూ! ఇషూ" రత్తమ్మ పడుకొనే కాకిని అద లించింది.

అదీ రత్తమ్మమీద పంతానికే వచ్చినట్లు యింకా బిగ్గరగా అరవసాగింది.

"ఓసి నీ యమ్మ కడుపు కాలా! నీకేం పోయేకాలం వచ్చిందే?" మంచం పక్కనేవున్న కర్రపుల్ల తీసి కాకి మీద గిరాటు వేసింది.

కర్రపుల్ల గోడమీదుగా దూసుకుపోయి వీధిలో పడింది. కాకి రివ్వున లేచిపోయింది.

"ఎవళ్ళకు పోయేకాల మొచ్చిందిరా? ఇంకా స్త యితే కన్ను పోయివుండును, వాళ్ళ చేతులిరగా!" దొడ్డిగుమ్మం తోసుకొని వొక వితంతువు కర్రపుల్ల చేత్తో పట్టుకొని లోపలకు ప్రవేశించింది గలగల మంటూ తిడుతూ.

జరిగిందేమిటో ఛప్పున గ్రహించిన రత్తమ్మ అలాగే మంచంమీద గుర్రుపెట్టి నిద్రపోతున్నట్లు నటించింది.

ఆ వచ్చిన విధవావిడ కాసేపు పరకాయించి చూసి మరల తిట్టుకుంటూ వెళ్ళిపోయింది.

ఆవిడ అటు వెళ్ళగానే రత్తమ్మ లేచి కూర్చుంది. తనమీద తనకే కోపం వచ్చింది. "ఈ పాపిష్టి లోకంలో ఎంత దొంగబ్రతుకు బ్రతకాల్సి వచ్చిందిరా?" అనుకుంది.

లేచి వీధితలుపు గడియ వేసివచ్చి మరల పడుకున్నది రత్తమ్మ. ఇట్లా నడుం వాల్చిందో లేదో వీధి తలుపులు "ధనధనా" మని మోగినయ్.

"అబ్బ! అబ్బ! యీ మాయదారి మంద నన్ను బతకనిస్తార్రా!" అంటూ పోయి తలుపు తీసింది.

చాకల్ది బట్టలు తీసుకొని లోపలికొచ్చింది.

"ఏమిటే, ఆ తలుపులు బాదటం?" అంటూ విసుక్కుంది రత్తమ్మ. చాకల్ది తన్ను కాదన్నట్టే మూట కింద దించి, గుడ్డలు లెక్కపెట్టి పక్కనపెట్టి అంది:

"మొన్న గుడ్డల్లో కాంతమ్మగారి చిన్నమ్మాయి చొక్కా వచ్చిందండీ?"

"ఏందే వచ్చిందీ?" కస్సుమంది రత్తమ్మ.

"ఎర్ర రంగు పట్టు చొక్కాండీ!"

"నీ బొందపడ. అట్లాంటిది మా ఇంట్లోనే లేదు గదే!"

"మీ యింట్లోనే వేసినట్టు బాగా జ్ఞాపకం అమ్మ గోరూ?"

"వొసేయ్! అట్టాంటె తప్పుడు కూతలు కూసే వంటే పళ్లు రాల్తాయ్, దొంగముండ కాజేసి మాఇంట్లో వేశానంటావేమే?"

ఇంతలోకే రత్తమ్మ కూతురు రెండోది పదేళ్లది. బజార్లోనుంచి ఇంట్లోకి పరుగెత్తుకొచ్చింది.

పిల్ల వంటిమీద వున్న చొక్కా చూసి "అదేనండీ చొక్కా" అంది చాకలిమనిషి ఆత్రంగా.

రత్తమ్మ గతుక్కుమంది.

క్షణంలో తెప్పరిల్లికొని చాకలిదానిమీద తోడే లులా దూకింది.

"మొన్న వాళ్ల నాన్న మద్రాసునుంచి తెచ్చిన గుడ్డయితే అది కాంతమ్మ కూతుర్దని వాగుతావంటే ముదనష్టపు ముండ?"

"ఏమో, అ పాపం, పుణ్ణెం ఆ బగమంతుడికే తెలి యాలి" అంది చాకల్ది.

"నీ తాడుతెగ మళ్ళీ అదే కూత కూస్తావేమే?" చేతులు చాచింది రత్తమ్మ

"మాటలు తిన్నగా రానీయం డమ్మగోరూ?" ఎదురు తిరిగింది చాకల్ది.

"వొసేయ్; రేపటినుండీ మా యింటికి రావద్దు; మానేసేయ్."

"అట్లాగే మానుకుంటా. మాకు రావాల్సిందేదో యిటా పారేయండి." అంటూ చాకల్ది మూట బుజాన వేసుకొని చరచరా బయటకు వెళ్లిపోయింది.

రత్తమ్మకు చిర్రెత్తిపోయింది. పక్కనే నిల్చున్న కూతుర్ని సాగదీసి నాలుగు బాదింది. పిల్ల బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టింది,

రత్తమ్మ కూతుర్ని అలా ఎందుకు కొట్టిందో రత్తమ్మ మనసుకే తెలియాలి.

ముఖాన కారుతున్న చెమట తుడుచుకొని, "ఉస్సురస్సురు" మంటూ పోయి మంచంమీద మళ్ళీ నడుం వాల్చింది.

రత్తమ్మకు మాగన్నుగా నిద్రపట్టిందో లేదో, పక్కింటివాళ్ళ అమ్మాయి హార్మోనియం పెట్టె భంయ్ మంటూ మోగింది:—

"శాంతము లేకా, సౌఖ్యములేదూ!" నాలుగు స్వరశృతిలో పాట సాగింది.

రత్తమ్మ మెదడులో తాటాకుల మంటలు లేచినయ్.

చిర్రున లేచింది. గోడకు నిచ్చెనవేసి, గోడపైగా యుద్ధానికి తలపడింది. గాలి వాటున రత్తమ్మ తిట్లు రత్తమ్మ ముఖంపైకే తిరిగి వచ్చాయి. అటువైపు విని పించుకున్న వాళ్లెవరూ లేరు. పైగా ఆ అమ్మాయి శృతి

పెంచి పాడసాగింది. "ఆ పచ్చానుగేళ్ళ పిల్ల తన మీద పగపట్టి యిలా సాధిస్తూంది అనుకుంది రత్తమ్మ.

లిట్టీ లిట్టీ నోరెండి కిందకు దిగింది. దిగుతూ దిగుతూ నిచ్చెనజారి కింద పడ్డది. మోకాలు కలకపట్టింది.

"అయ్యో, రామయ్యతండ్రీ! నా కష్టాలు ఎన్నటికి తీరునురా తండ్రీ!" కలకపట్టిన మోకాలు తోముకుంటూ అంది రత్తమ్మ.

"ఏం దమ్మగోరూ? అడ కూకుండారూ?" అంటూ పనిమనిషి లోపలకు వచ్చింది.

"అదిస రేగానీ; నిన్న రాలేదు, ఎక్కడ చచ్చావ్?" అడిగింది రత్తమ్మ.

"సాలా ఇబ్బందయే రాలేదమ్మగోరూ; నిన్న మా పేటలో ఒకడు చచ్చిపోయాడు."

"చావు మంచోళ్ళకు దబ్బునే వస్తదే నీకూ నాకూ రాదు కానీ."

"మనకీ వస్తదమ్మా భూమ్మీద నూకలు నిండితే."

రత్తమ్మ గుండెలు చిక్కబట్టినయ్. కాలు కలుక్కుమంది. "వోసీ; వోడిగల ముండ; ఎంతమాట పడితే అంత మాటంటావ్" అనుకుంది రత్తమ్మ మనసులోనే.

"సరే సద్దువుగాని కానీ, ముందు అంట్లుతోము. రెండురోజుల్నుంచీ మురిగిపోతున్నయ్."

రామి అంట్లు తోమిపెట్టి పెద్ద బావికి మంచినీళ్ళ కెళ్ళింది. వంటింట్లో పళ్ళెం కిందపడ్డ చప్పుడైంది.

"అబ్బబ్బ; ఎవర్రా అదీ?" అంటూ రత్తమ్మ వంటింట్లోకి పరిగెత్తింది.

ఖాళీ నేతిగిన్నె రత్తమ్మకేసి బావురుమంటూ చూసింది. రత్తమ్మ గుండెలు బాదుకుంటూ పంచాంగం మొదలెట్టింది.

"దీని తాడుతెగ దీనికేం పోయేకాలం మొచ్చింది? దొంగముండను రానియ్? పక్క లిరగతన్నిస్తా"

బావినుండి బిందె చంకన పెట్టుకొని వచ్చిన రామి రత్తమ్మ వాలకం చూచి నిశ్చేష్టురాలై నిల్చుంది.

రత్తమ్మ రౌద్రాకారం దాల్చింది. హిడింబిలా రామి మీదకు దూకింది. అసలే రత్తమ్మతల్లికి నిండా కోప మొస్తే మనిషే కాదు.

బుజానవున్న బిందె కింద పడేసి, రత్తమ్మ చేతుల్నుండి జుట్టు విడిపించుకొని రామి గిర్రున వెనక్కి తిరిగింది.

పోతూపోతూ అదీ లిట్లకు తగులుకుంది. దా నోర్నరు కూడా ఏమంత చిన్నది కాదు.

"అయ్యో! నా బిందె" రత్తమ్మ చొట్టలు పోయిన బిందెను కావిలించుకుంది. నీళ్ళ బిందెను యీడ్చుకుంటూ రత్తమ్మ ఇంట్లోకి పోయింది. తల నొప్పితో పగిలి పోతూంది.

"అన్నట్లు మధ్యాన్నం కాఫీ తాగలేదు గదూ!" కాఫీ కాసుకుందా మని అలమారులోని పాలగిన్నె దగ్గ

రకు పోయింది. గిన్నెమీద మూత కిందపడి వుంది. పాల గిన్నె వెలితిగా రత్తమ్మ కళ్ళలోకి చూసింది.

రత్తమ్మకు మూర్ఛ వచ్చినంత పనైంది. "ఓ నారాయణమూర్తీ! యీ బాధలు నేను భరించలేనురా! తండ్రీ!" రత్తమ్మ చేతులు పైకెత్తి తల బాదుకొంది.

రత్తమ్మ ఎత్తిన తల అలాగే వుంచి పైకి చూసింది. అటకమీద కూర్చున్న నల్ల పిల్లి మూతి నాక్కుంటూ రత్తమ్మవంక కొంటెగా చూసింది.

"ఓసి నీ యమ్మ కడుపుకాల! నీకేం పుట్టిందే?" అంది రత్తమ్మ పిల్లిని.

పిల్లి రత్తమ్మను చూసి కళ్లురిమి బుసకొట్టింది.

"ఓసి! నీ సిరుసుమండ! నేను నిన్నేం చేశానే? నువ్వుకూడా నాకు శత్రువయావంటే?" అంటూ రత్తమ్మ బయటకు వొక్క దూకు దూకింది.

రత్తమ్మ వాకిట్లోకి వచ్చేసరికి వాకిలి ముందు—

"కళ్లులేని కబోధి పతులము నారాయణా! ధర్మ తల్లివి నీవు సీతమ్మా?"

అంటూ నలుగురు బిచ్చగాళ్లు తయారయారు.

"చాల్లే! పో! పొండి! ఎద్దుల్లాగున్నారు పని చేసుకోగూడదూ?" అన్నది రత్తమ్మ.

అంటే వాళ్ళు వినిపించుకొంటేగా? గొంతులు పెద్దవి చేసి "ధర్మతల్లివి నీవు సీతమ్మా!....కళ్లులేని—"

రత్తమ్మతల్లికి మతి పోయినంత పనైంది.

"ఈ జాతరేంటిరా భగవంతుడా? వూళ్ళో ఇన్నిళ్లుంటే యీ మాయదారి మందకు మా యిల్లే కన్పించాలా?" అంటూ తలుపులు "ధఢీ" మని వేసింది.

ఇంట్లోకి పోతున్న రత్తమ్మను చూసి గోడమీది కాకి బొంగురు గొంతుతో అరుస్తోంది. వంటింట్లో నుండి మూతి నాక్కుంటూ వస్తూన్న నల్లపిల్లి రత్తమ్మను చూసి బుసకొట్టింది. పక్కంటమ్మాయి "శాంతమూ లేక సౌఖ్యమూ లేదూ" అంటూ రోడ్డింజను ధ్వనిని మించి పాడుతోంది.

రత్తమ్మతల్లికి పిచ్చెత్తిపోయింది. కాళ్ళు పట్టు తప్పిపోతున్నాయి. గుండెల్లో ఆయాసం. వళ్ళు చమటలు కమ్మినై.

రత్తమ్మ బుర్రలో హోరు సాగింది. వంటింట్లో కుప్పలా కూలబడింది. రెండు చేతులూ పైకెత్తి ప్రార్థించింది.

"ఓ ఆపద్బాంధవా! దుష్టశిక్షకా! శిష్టరక్షకా! ఇంకా నీకు దయరాలేదా? ఓ కలి పురుషుడా! ఎప్పుడు చేంచేస్తావయ్యా ఈ పాపుల సంహారం?"

వళ్లు నీరసించి, ప్రాణం శోషకొచ్చి, అర్ధనిమీలిత నేత్ర అయిన రత్తమ్మ హృదయంలో ఖడ్గం చేత ధరించి, వీర భోగ వసంతరాయుడెక్కి వస్తోన్న గుర్రపు డెక్కల చప్పుడు లీలగా విన్పించింది.

అయితే బయట బిచ్చగాళ్ళ గోల, మిషినీసాయిబు కేకలు, పనిమనిషి నోరూ, కోటమ్మ సాధింపూ, వంటింట్లో పిల్లి, పక్కింటి అమ్మాయి "హార్మోనియం" రొదా, ప్రహారీ గోడమీది కాకి గోలా, రత్తమ్మ చెవుల్లో దూరి కలిపురుషు డెక్కి వస్తోన్న గుర్రపు డెక్కల చప్పుడును వినపడకుండా చేస్తున్నాయ్.

పాపం: రత్తమ్మతల్లికి రారాని కష్టాలే వచ్చాయి. ఏనాటికైనా రత్తమ్మతల్లి కష్టాలు యిరగ డవుతాయో లేవో చూద్దాం!